క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కందనూలు: నాగర్‌కర్నూల్ పట్టణంతో పాటు ఐపీడీఎస్ సబ్‌స్టేషన్ మరమ్మతు కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు టౌన్, పరిసర గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో అసిస్టెంట్ ఇంజినీర్ కృష్ణ గోపాల్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించగలరని కోరారు.

అచ్చంపేట రూరల్: పట్టణంలోని 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు కారణంగా శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి 5గంటల వరకు అచ్చంపేట, అమ్రాబాద్, పదర, బల్మూర్, ఉప్పునుంతల, లింగాల మండలాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ ఆంజనేయులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు

వెల్దండ: మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వొద్దని ఎస్‌ఐ రవి సూచించారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైదరాబాదు–శ్రీశైలం జాతీయ రహదారి కావడంతో ప్రతినిత్యం అధికసంఖ్యలో రాకపోకలు కొనసాగిస్తాయన్నారు. వాహనదారులు రోడ్డు నిబంధనలను పాటించాలన్నారు. మైనర్లు వాహనాలు నడిపిస్తే చట్టరీత్య చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం తాగి పట్టుబడితే కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రజలు, వాహనదారులు పోలీసులకు సహకరించాలని కోరారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



నాగర్‌కర్నూల్‌రూరల్: జిల్లా కేంద్రంలో ఏఐవైఎఫ్ క్యాలెండర్‌ను గురువారం సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం బాల్‌నర్సింహతో కలిసి ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి ఆవిష్కరించారు. అఖిల భారత సమైక్యత కోసం ఏఐవైఎఫ్ ఎన్నో ఉద్యమాలు చేసిందని, నిరుద్యోగుల ఉపాధికోసం ఎన్నో పోరాటాలు చేసిందని కొనియాడారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి మారెడు శివశంకర్, బిజ్జ శ్రీనివాసులు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు మధు గౌడ్, బండి లక్ష్మీపతి, బాలపీరు తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ గ్రహీతకు సన్మానం



బల్మూర్: మండలంలోని కొండనాగుల ఉమామహేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకుడు ఈశ్వర్‌లాల్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టా పొందాడు. ఈ మేరకు గురువారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్రం ఆధ్వర్యంలో ఈశ్వర్‌లాల్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ డాక్టరేట్ సాధించడం నల్లమల ప్రాంత విద్యార్థులకు స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు వెంకటయ్య, రవి, అశోక్, నరహింహ్మా, జాన్, లక్ష్మణ్‌గౌడ్, కృష్ణ, నర్సింహ్మారావు, ముంతాజ్, గాయత్రి, తదితరులు పాల్గొన్నారు.

దళితబంధు యూనిట్లు మంజూరుచేయాలి

కొల్లాపూర్: గత ప్రభుత్వం అమలుచేసిన దళిత బంధు పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించాలని, దళితులకు మంజూరైన యూనిట్లకు వెంటనే నిధులు విడుదల చేయాలని తెలంగాణ మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు కలమంద శేఖర్ కోరారు. గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితుల అభివృద్ధికి దోహదపడే పథకాలను యథాతంగా అమలు చేయాలన్నారు. అదేవిధంగా ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు నిధులు కేటాయించాలన్నారు. దళితుల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు.

మాజీ సీఎంను కలిసిన మున్సిపల్ చైర్మన్



కల్వకుర్తి: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ సత్యం గురువారం అసెంబ్లీలోని బీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయంలో కలిశారు. ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేసిన కేసీఆర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

నూతన ఎస్‌ఐగా మాధవరెడ్డి

కల్వకుర్తి టౌన్: పట్టణ ఎస్‌ఐగా మాధవరెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎస్‌ఐ రమేష్ వీఆర్‌కు బదిలీకాగా, మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల పీఎస్ నుంచి మాధవరెడ్డి కల్వకుర్తికి బదిలీపై వచ్చారు. పోలీస్ సిబ్బంది నూతన ఎస్‌ఐకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎస్‌ఐ కల్వకుర్తి డీఎస్పీ పార్థసారధితో పాటుగా ఎస్పీ వైభవ్ గైక్వాడ్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు.

బాధ్యతాయుతంగా పనిచేద్దాం

అమ్రాబాద్: గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయం చేసుకుంటూ బాధ్యతాయుతంగా పనిచేద్దామని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం మీటింగ్ హాల్‌లో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా ఆయా శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఆయా గ్రామాల్లె నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. పలు అభివృద్ధి పనుల వివరాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్య, విద్యుత్, వైద్యం, సాగునీరు తదితర సమస్యలపై అధికారులు నిర్లక్ష్యం చేయొద్దన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని కోరారు. సర్పంచ్‌లకు చివరి సర్వసభ్య సమావేశం కావడంతో ఎమ్మెల్యే వారిని సన్మానించారు. అనంతరం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు. సమావేశంలో ఎంపీపీ శ్రీనివాసులు, వైస్ఎంపీపీ ప్రణీత, ఎంపీడీఓ శంకర్‌నాయక్, తహసీల్దార్ శ్రీకాంత్, ఏఓ సురేష్‌కుమార్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



అమ్రాబాద్ మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

తెలకపల్లి: మండల కేంద్రంలోని కాంప్లెక్స్ మీటింగ్ హాల్‌లో ఎంపీపీ కొమ్ము మధు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వ్యవసాయం, పౌరసరఫరాలపై ఏఓ సందీప్‌కుమార్‌రెడ్డి, తహసీల్దార్ మురళీ మోహన్ సమీక్ష చేశారు. గౌరెడ్డిపల్లి సర్పంచ్ వెంకట్‌రెడ్డి భూ సమస్యలు సభ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఎంపీపీ కొమ్ము మధు మాట్లాడుతూ శుక్రవారం నుంచి గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతుందన్నారు. సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించొద్దన్నారు. అనంతరం పదవీ విరమణ పొందుతున్న సర్పంచ్‌లను సన్మానించారు. ఎంఈఓ చంద్రుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సరిత, ఏపీఓ మల్లేష్, వైస్ ఎంపీపీ విజయనిర్మల, ఎంపీడీఓ భాస్కర్, తహసీల్దార్ మురళీమోహన్, సింగిల్ విండో చైర్మన్ భాస్కర్ రెడ్డి, ఆయా శాఖల మండల అధికారులు, ఎంపీటీసీల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



తెలకపల్లిలో సర్పంచ్‌లను సన్మానిస్తున్న ఎంపీపీ

ప్రత్యేకాధికారుల నియామకం

ఉప్పునుంతల: సర్పంచుల పదవీకాలం ముగిసినందున మండలంలోని గ్రామ పంచాయతీలకు ప్రభుత్వ ఆదేశానుసారం ప్రత్యేకాధికారులను నియమించినట్లు ఎంపీడీఓ లక్ష్మణ్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అయ్యవారిపల్లి గ్రామ పంచాయతీకి ఏఈఓ భరత్‌కుమార్, సీబీ తండాకు ఏఈఓ వినోద్, దాసర్లపల్లికి ఏఎస్ఓ సాయి, దేవదారికుంటతండాకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బీపాషా, ఈరట్వానిపల్లికి డీటీ సరస్వతి, గువ్వలోనిపల్లికి ఈజీఎస్ ఏపీఓ సుదర్శన్‌గౌడ్, కాంసానిపల్లికి హెచ్ఎం చంద్రశేఖర్‌ను, కాంసానిపల్లి తాండాకు సీనియర్ అసిస్టెంట్ జయమ్మ, కొరటికల్‌కు ఏఈఓ మంజుల, లత్తీపూర్‌కు తహసీల్దార్ తబితారాణి, లక్ష్మాపూర్‌కు ఏఓ సునీత, మామిళ్లపల్లికి ఎంపీహెచ్ఎస్ శంకరమ్మ, మర్రిపల్లి ఏఈఓ రవి, మొల్గరకు ఏఈఓ వినోద్‌వర్మ, పెద్దాపూర్‌కు ఎమ్మార్డై సుజాత, పెనిమిళ్లకు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయిక్రిష్ణ, ఫిరట్వానిపల్లికి ఏఈఓ సుమతి, పూర్యనాయక్ తండా ఏఆర్‌ఐ రాజేశ్వర్‌రెడ్డి, రాయిచెడ్‌కు ఏఈ ఐఆర్ అలివేళ, జప్తి సదగోడుకు పీర్ ఏఈ సందీప్‌రెడ్డి, సూర్యతండాకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అమృత, తాడూరుకు ఎంపీఓ నారాయణ, తిప్పాపూర్‌కు ఎంపీహెచ్ఎస్ ప్రభావతి, తిర్మలాపూర్‌కు సూపరింటెండెంట్ అమీదోద్దీన్, ఉప్పరిపల్లికి ఐకేపీ ఏపీఎం సైదులును, ఉప్పునుంతలకు ఎంపీడీఓ లక్ష్మణ్‌రావు, వెల్టూర్‌కు పశువైద్యాధికారి నరేందర్‌ను ప్రత్యేకాధికారులుగా నియమించినట్లు ఎంపీడీఓ తెలిపారు.



కోడేరులో మాట్లాడుతున్న ఎంపీఓ శ్రావణ్‌కుమార్

కోడేరు: మండలంలోని 22 గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు ఎంపీఓ శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బాడిగదిన్నెకు ఏఈఓ ప్రియాంక, బావాయిపల్లి తహసీల్దార్ సైదులుగౌడ్, ఎర్రన్నబావి తండాకు ఏఈ బాలరాజు, గుండ్యావాల్యానాయక్ తండా వెటర్నరీ అసిస్టెంట్ రజిత, జనుంపల్లి పంచాయతీశాఖ ఏఈ కృష్ణ, కోడేరు ఎంపీడీఓ బాలచంద్రసృజన, కొండ్రావుపల్లి ఆర్‌ఐ జంబులయ్య, మాచుపల్లి ఎంపీఓ శ్రావణ్‌కుమార్, ముత్తిరెడ్డిపల్లి ఆర్‌ఐ సురేందర్, మైలారం హైస్కూల్ హెచ్ఎం కృష్ణయ్య, నాగులపల్లి మండల వ్యవసాయాధికారి శ్రీరాం, నాగులపల్లి తండాకు ఏఈఓ శ్రావణ్‌కుమార్, నర్సాయిపల్లి హెచ్ఎం ఎల్లయ్య, నార్యానాయక్ తండాకు ఏఈఓ నవ్యభారతి, పస్పుల పశువైద్యాధికారి డాక్టర్ భానుకిరణ్, రాజాపూర్ డిప్యూటీ తహసీల్దార్ జయలక్ష్మి, రేకులపల్లి ఏఈఓ పృథ్వీరాజ్, సింగాయిపల్లి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రవి, తాగూరు తండాకు ఇరిగేష్ ఏఈ లక్ష్మి, తీగలపల్లికి ఏఈఓ మధుసూదన్‌రెడ్డి, తుర్కదిన్నెకు కొండ్రావుపల్లి హెచ్ఎం కుర్మయ్య, ఎత్తం మైలారం హెచ్ఎం ఆంజనేయులును నియమించినట్లు తెలిపారు.

వేసవి దుక్కులతో భూమి సారవంతం

తాడూరు: వేసవి దుక్కులతో భూమి సారవంతం అవుతుందని రావేఫ్ విద్యార్థినులు పేర్కొన్నారు. గురువారం కేవీకే పాలెం కళాశాల ఆధ్వర్యంలో మండలంలోని వేసవి దుక్కులు వాటి ప్రాముఖ్యత వంటి వివిధ అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. భూమిని 15, 30 సెం.మీ దున్నడం వల్ల భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. పొలంలో తేమను నిలుపుకునే శక్తి కలుపు మొక్కలు నశిస్తాయని వివరించారు. ఎలుకల బెడద తగ్గుతుందని, నేల కోతకు గురికాకుండా ఉంటుందని పంటకు ఆశించే పురుగులు ప్రస్తుతం నిద్రావస్థలో ఉంటాయన్నారు. కార్యక్రమంలో విద్యార్థినులు నివేదిత, సింధూర, రమ్య, ప్రవళిక, నవత, సానియా తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న రావేఫ్ విద్యార్థినులు

మండల స్థాయి టాలెంట్ టెస్టు

చారకొండ: మండల కేంద్రంలో జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గురువారం తెలంగాణ సాంఘిక శాస్త్ర టీచర్స్ ఫోరం నాగర్‌కర్నూల్ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్టు నిర్వహించారు. మండలంలోని జూపల్లి జెడ్పీహెచ్ఎస్, మండల కేంద్రంలో కేజీబీవీ, జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. మండల కేంద్రానికి చెందిన జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు యాదగిరి, వెంకటేశ్వర్లు, గీత, కోట్యా, పద్మ తదితర ఉపాధ్యాయులు ఉన్నారు.

మార్కెట్ చైర్మన్ వెంకట్‌గౌడ్‌కు ఇవ్వాలి

చారకొండ: చారకొండ మాజీ జెడ్పీటీసీ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండె వెంకట్‌గౌడ్‌కు కల్వకుర్తి మార్కెట్ చైర్మన్ పదవి ఇవ్వాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు, డీసీసీ ప్రధాన కార్యదర్శి మహేందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 30 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీకి సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు.

7న ఉచిత కంటి చికిత్స శిబిరం

కందనూలు: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఈనెల 7వ తేదీ కంటి వైద్య శిబిరం నిర్వహిస్తునట్లు ఆప్తాలమిక్ ఆఫీసర్ శివారెడ్డి గురువారం ఒకప్రకటనలో తెలిపారు. జిల్లా అంధత్వ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఉచితంగా బీపీ, షుగర్, కరోనా పరీక్షలు నిర్వహిస్తునట్లు వివరించారు. పరీక్షల కోసం వచ్చేవారు ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్ జిరాక్స్ కాపీలు, ఫోన్ నంబర్ వెంట తీసుకొనిరావాలని కోరారు.

ఎంపీ టికెట్ స్థానికుడికే ఇవ్వాలి

కందనూలు: స్థానికులకే కాంగ్రెస్ పార్టీ ఎంపీ టికెట్ కేటాయించాలని టీపీసీసీ డాక్టర్స్ సెల్ వైస్ ప్రసిడెంట్ చెన్నయ్య అన్నారు. గురువారం నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థిత్వం కోసం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో రిటర్నింగ్ అధికారికి దరఖాస్తు చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఎంబీబీఎస్, జనరల్ సర్జన్‌గా ప్రాంత ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండే తనకే టికెట్ కెటాయించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కల్వకుర్తి టౌన్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలైన ఘటన గురువారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం గట్టుఇప్పలపల్లికి చెందిన సైదులు భార్యతో కలిసి సొంత పనుల నిమిత్తం కల్వకుర్తికి వచ్చారు. రోడ్డుకు అవతల వైపు ఉన్న అతని భార్యవద్దకు బైక్‌పై వెళ్తుండగా మహబూబ్‌నగర్ నుంచి కల్వకుర్తి వైపు వస్తున్న కారు బైక్‌ను ఢీకొన్నది. ఈ ప్రమాదంలో సైదులుకు తీవ్రగాయాలయ్యాయి. బాధితుడిని కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రి తరలించారు.

ఇసుక టిప్పర్ల పట్టివేత

కల్వకుర్తి టౌన్: అధిక లోడుతో వెళ్తున్న ఏడు ఇసుక టిప్పర్లను విజిలెన్స్ అధికారులు గురువారం పట్టుకున్నారు. విజిలెన్స్ సీఐ అప్పయ్య తెలిపిన వివరాల ప్రకారం వంగూర్ మండలంలోని పోతిరెడ్డిపల్లి ఇసుక క్వారీ నుంచి ఇసుక తరలించేందుకు అనుమతులు తీసుకున్నారు. కాని అధికలోడ్‌తో ఇతర మార్గాల్లో ఇసుక తరలిస్తున్నారని సమాచారం మేరకు దాడులు నిర్వహించగా ఏడు టప్పర్లు పట్టుబడినట్లు వివరించారు. టిప్పర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి వాహన యజమానులపై ఓవర్‌లోడ్ కేసులను చేశామని విజిలెన్స్ అధికారులు తెలిపారు.

కేసు నమోదు

చారకొండ: మండలంలోని చంద్రాయన్‌పల్లి గ్రామానికి చెందిన గెల్వయ్య, శంకరయ్యలు పాత కక్షల కారణంగా ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. దాడుల్లో ఇరువురికి గాయాలయ్యాయి. గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. హెడ్‌కానిస్టేబుల్ నాగయ్య కేసు నమోదు చేస్తుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కుష్టు వ్యాధిగ్రస్తులు అధైర్యపడొద్దు



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

అచ్చంపేట రూరల్: కుష్టు వ్యాధిగ్రస్తులు అధైర్యపడొద్దని డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ మధుమోహన్ అన్నారు. గురువారం పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలోని విద్యార్థులకు కుష్టు వ్యాధి అవగాహన పక్షోత్సవంలో భాగంగా వైద్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుష్టుపై అందరికి అవగామన ఉండాన్నారు. స్పర్శ లేని తెల్లటి, రాగి, గోధుమ కలర్ మచ్చలు చర్మంపై కనిపిస్తే దగ్గరలోని ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందిని సంప్రదించాలని కోరారు. కుష్టు వ్యాధిని తొలిదశలో గుర్తించి సంపూర్ణ చికిత్స తీసుకుంటే పూర్తిగా నయమవుతుందన్నారు. అంగవైకల్యం బారిన పడకుండా కాపాడగలుగుతామన్నారు. కుష్టు వ్యాధి తొలి దశ స్థాయిని బట్టి 6 నెలలు లేదా 12 నెలలు చికిత్స ఉంటుందని, అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఉచితంగా చికిత్స, మందులు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ అశోక్ ప్రసాద్, సిబ్బంది శ్రీను, రమేష్, సత్యనారాయణ, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయబృందం పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌లే కీలకం

కల్వకుర్తిరూరల్: గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌లే కీలకమని ఫుడ్ కమిషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిషత్ సమావేశ మందిరంలో మండలంలోని 24 మంది గ్రామ పంచాయతీల సర్పంచ్‌లకు ఎంపీపీ మనోహరాచెన్నకేశులు అధ్యక్షతన సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు జంగయ్య, మార్కెట్ మాజీ చైర్మన్ విజయ్‌గౌడ్, ఎంపీడీఓ ఆంజనేయులు, ఎంపీఓ దేవేందర్, ఎంపీటీసీలు రవీందర్‌రెడ్డి, ఎల్లమ్మ, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

కందనూలు: బిజినేపల్లి మండలం శాయన్ పల్లిలో సర్పంచ్ అవంతిని ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు. హెచ్ఎం జగన్, ప్రాథమిక పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ శిరీష, ఉపాధ్యాయులు సూర్య కళ, లలిత, శివకుమార్, స్వామి, విద్యావతి, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

వెల్దండ: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణంలో సర్పంచ్ భూపతిరెడ్డితో పాలక వర్గానికి వీడ్కోలు సమావేశం నిర్వహించారు. అనంతరం పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఉపసర్పంచ్ నిరంజన్, బచ్చు రామకృష్ణ, విజేందర్‌రెడ్డి, నిరంజన్, కృష్ణారెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంపీఓ సునీత, సీనియర్ అసిస్టెంట్ రేవంత్‌రెడ్డి, కార్యదర్శి గిరి, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.



తాడూరు: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో సర్పంచ్‌లు కీలకమని ఎంపీపీ శ్రీదేవీ, ఎంపీడీఓ గంగమోహన్‌లు అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో రూ.35 లక్షలతో నిర్మించిన సమావేశ భవనాన్ని వారు ప్రారంభించారు. సమావేశంలో తహసీల్దార్ ప్రమిళ, ఎంపీఓ లక్ష్మణ్ నాయక్, పీఆర్ ఏఈ ఉపేందర్‌రెడ్డి, ఏఓ సాయిరమేష్‌కుమార్, వైస్ ఎంపీపీ శివలీల, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

లింగాల: మండల కేంద్రంలోని మేజర్ గ్రామ పంచాయతీ ఆవరణలో నూకల రాజమణెమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో లింగాల, కొత్తకుంటపల్లి, కొత్త చెర్వుతండా, అవుసలికుంట, దారారం, శ్రీరంగాపూర్ సర్పంచులకు శాలువాలు సన్మానించారు. ఫౌండేషన్ నిర్వాహకుడు నూకల శంకర్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

పొట్టు దగ్ధం: రూ.40 వేల ఆస్తినష్టం



పూర్తిగా దగ్ధమైన బుడ్డపొట్టు

కోడేరు: మండల కేంద్రానికి చెందిన రైతు రవి తన వ్యవసాయ పొలం వద్ద రెండు ట్రాక్టర్ల బుడ్డపొట్టు పొలం వద్ద పెట్టుకోవడంతో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పటించారు. దీంతో చుట్టుపక్కల వారు గమనించి మంటలను ఆర్పినా లాభం లేకుండా పోయింది. దాదాపు రూ.40 వేల వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపాడు. ప్రభుత్వం నుంచి తమను ఆదుకోవాలని కోరారు.

జిల్లా ఆస్పత్రికి చెంచు గర్భిణి

మన్ననూర్: రక్త హీనతతో బాధపడుతున్న చెంచు గర్భిణి మహిళను మెరుగైన వైద్యం కోసం తిరిగి నాగర్‌కర్నూల్ జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు ఐటీడీఏ అధికారులు, సిబ్బంది తెలిపారు. వివరాల ప్రకారం...నల్లమల అటవీ లోతట్టు ప్రాంతం లింగాల మండల పరిధిలోని రాంపూర్ పెంటకు చెందిన బయ్యమ్మకు ఇదివరకు ఇద్దరు పిల్లలు కాగా ప్రస్తుతం మూడోసారి గర్భం దాల్చింది. 8వ నెల కావడంతో మన్ననూర్‌లోని ఆర్డీటీ ఆస్పత్రిలో ఆర్డీటీ వైద్యాధికారి సైఫుల్లాఖాన్ సమక్షంలో పరీక్షలు నిర్వహించగా 2.9 శాతం మాత్రమే రక్తం ఉన్నట్లు గుర్తించారు. అక్కడే ఉన్న కొందరు ప్రజా సంఘాల నాయకులు డీఎండీహెచ్ఓ సుధాకర్ లాల్, డీటీడీఓ కమలాకర్‌రెడ్డికి సంఘటన గురించి తెలియజేశారు. స్పందించిన అధికారులు జిల్లా ఆస్పత్రికి తరలించాలని ఆదేశించారు. అధికారుల సూచన మేరకు ఆర్డీటీ అంబులెన్స్ సహాయంతో నాగర్ కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రికి బుధవారం తరలించారు. కుటుంబ సభ్యులతో పాటూ రాత్రి అక్కడే ఉన్న మహిళ గురువారం తెల్లవారేసరికి ఆస్పత్రి సిబ్బందికి చెప్పకుండా ఆస్పత్రి నుంచి వెళ్లిపోయారు. అధికారులు రాంపూర్ పెంటకు తమ సిబ్బందిని పంపించారు. సిబ్బంది బాధిత కుటుంబంతో మాట్లాడి, నచ్చజెప్పి అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స అందించారు. ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ సూచన మేరకు ఐటీడీఏ, వైద్య శాఖ తరుపున డాక్టర్ తారాసింగ్, అప్పాపూర్ సర్పంచ్ గురువయ్య మహిళకు మనోధైర్యాన్ని కల్పించారు. వైద్య సిబ్బంది రాజేష్‌తో పాటూ ఒక ఏఎన్ఎంను వలంటీర్‌ను నియమించడంతో పాటూ ఖర్చులకు డబ్బులు సమకూర్చి తిరిగి జిల్లా ఆస్పత్రిలో చేర్పించారు.

నర్సరీలను పరిశీలించిన ఏపీడీ

పెద్దకొత్తపల్లి: పట్టణంతోపాటు, దేవినేనిపల్లి, చిన్న కార్పాముల గ్రామాల్లోని నర్సరీలను ఏపీడీ చంద్రశేఖర్ గురువారం పరిశీలించారు. ప్రతి నర్సరీలలో బెడ్లు ఖాళీ లేకుండా మొక్కలు ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్లాంటేషన్ మేనేజర్ జీవన్, ఏపీఓ మంజుల, రామ్మోహన్‌రెడ్డి, టీఏలు శివయ్య పాల్గొన్నారు.

ఐక్యతతోనే హక్కుల సాధన



సన్మానిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

వెల్దండ: ఐక్యతతోనే హక్కుల సాధించవచ్చని జిల్లా మత్స్యశాఖ డైరెక్టర్ కసారపు వెంకటయ్యముదిరాజ్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని ముదిరాజ్ భవనంలో ఆ కులస్తుల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. ఏళ్లుగా ముదిరాజ్‌ల హక్కుల కోసం పోరాటం చేస్తున్న ఫలితం దక్కలేదన్నారు. న్యాయం జరిగే వరకు కలసికట్టుగా పోరాడుదామని పిలుపునిచ్చారు. ముదిరాజ్‌లను బీసీ–డీ నుంచి బీసీ–ఏలోకి మార్చాలని డిమాండ్ చేశారు.

నూతన కమిటీ ఎన్నిక..

పట్టణ ముదిరాజ్ మహాసభ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బస్నమోని శ్రీనివాస్‌ముదిరాజ్, ఉపాధ్యక్షుడిగా తుంగ కుమార్‌ముదిరాజ్, ప్రధాన కార్యదర్శిగా మల్లయ్యముదిరాజ్, సహాయ కార్యదర్శిగా విజయ్ ముదిరాజ్, కోశాధికారిగా ప్రశాంత్ ముదిరాజ్‌లతో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి



నాగర్‌కర్నూల్‌రూరల్: దేశవ్యాప్తంగా నెల 16న చేపట్టనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు, సహాయ కార్యదర్శి పొదిల రామయ్య కోరారు. గురువారం కార్మికులతో కలిసి వారు డీఎంఅండ్ హెచ్ఓ కార్యాలయంలో ఆ శాఖ ప్రధాన అధికారికి సమ్మె నోటీసును అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు వర్దం పర్వతాలు, నాయకులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరిస్తాం

కల్వకుర్తిరూరల్: పల్లెపల్లెకు ప్రధాని నరేంద్రమోదీ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తామని గావ్ చలో అభియాన్ ప్రోగ్రాం ఇన్‌చార్జ్ రాఘవేందర్‌గౌడ్ అన్నారు. గురువారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ 10 సంవత్సరాలలో దేశంలోని అన్ని రాష్ట్రాల అభివృద్ధి కోసం, ప్రజల సంక్షేమానికి చేపట్టిన పనులను వివరిస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దుర్గాప్రసాద్, జిల్లా కార్యదర్శి కృష్ణ గౌడ్, పట్టణాధ్యక్షుడు నర్సింహా, నిరంజన్ గౌడ్, రవిగౌడ్, చందు, శివ తదితరులు పాల్గొన్నారు.

రైతులు సంఘటితం కావాలి

కల్వకుర్తిరూరల్: రైతులు సంఘటిత కావాల్సిన అవసరం ఉందని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యదర్శి న్యాయవాది విజయ్ గోపాల్ రావు కోరారు. మండలంలోని లింగసానిపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో సభ్యత్వ నమోదును ఆయన ప్రారంభించారు. ఈ నెల 20వ తేదీ వరకు సభ్యత్వ నమోదు కొనసాగుతుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఎద్దుల అంజన్‌రెడ్డి, కల్వకుర్తి డివిజన్ అధ్యక్షుడు పసుల గోవర్ధన్‌రెడ్డి, ఉస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో హాస్యపు పోటీలు

కందనూలు: పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో తెలుగు శాఖ అధ్యక్షుడు పెబ్బేటి మల్లికార్జున్ అధ్యక్షతన హాస్యపు పోటీలు నిర్వహించారు. ప్రముఖ తెలుగు సినిమా కమెడియన్ బ్రహ్మానందం పుట్టినరోజును పురస్కరించుకొని క్లాస్‌మెట్ క్లబ్ ఆధ్వర్యంలో పోటీలు ఏర్పాటు చేశారు. క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు వాసా రాఘవేందర్ సమకూర్చిన పుస్తకాలను ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నిర్వాహకులు అందజేశారు. ప్రిన్సిపాల్ ఖమర్ షాజహాన్ సుల్తానా, షేక్ ఖాజాబీ, శ్రీనువాసులు, కోదండ రాములు, పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమావేశమైన పూర్వవిద్యార్థులు

వెల్దండ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 2007–2008 పదో తరగతి పూర్వ విద్యార్థులు గురువారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మండల కేంద్రంలోని ఆకృతి గార్డెన్‌లో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని కుటుంబ, ఉద్యోగ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసుకొని సంబురపడ్డారు. భవిష్యత్‌లో తోటి విద్యార్థులకు ఏ సమస్య వచ్చిన అందరు కలసికట్టుగా అండగా ఉందామని నిర్ణయం తీసుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు.

బుద్ధుడి బోధనలు ఆచరణీయం

నాగర్‌కర్నూల్‌రూరల్: బుద్ధుడి బోధనలు ఆచరణీయమని వనపట్ల సర్పంచ్ రజిత మన్నెపు రెడ్డి అన్నారు. గురువారం గ్రామంలో బుద్ధుడి విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. సమాజ శాంతదూత , ప్రేమ, అహింస, కరుణ, జ్ఞానం, తాత్విక బోధనలకు చిహ్నంగా బుద్ధుడు నిలిచారన్నారు. విగ్రహదాత రచయిత, కవి వనపట్ల సుబ్బయ్య మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని ప్రవేశికలో జాతీయ వాక్యంగా సత్యమేవ జయతే అన్న నినాదం బౌద్ధం చేంచి తీసుకున్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో జర్నలిస్టులు నందికొండ మోహన్, కవులు ఎదిరెపల్లి కాశన్న, సీనియర్ పాత్రికేయుడు దినకర్, కల్వకోలు మద్దిలేటి, లక్ష్మారెడ్డి, మన్నెపురెడ్డి, రాము, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.



బుద్ధుడి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సర్పంచ్ రజిత

ఎమ్మెల్సీ నివాళి

తెలకపల్లి: మండల కేంద్రంలోని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బలుస శ్రీరాములు సతీమణి బలుస సరస్వతి అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి గురువారం సరస్వతి భౌతికకాయంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట నాయకులు బాలగౌడ్ పాల్గొన్నారు.

కేవీపీఎస్ నాయకుల నిరసన

తాడూరు: దళితుడిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు కాశన్న డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో దాడిని ఖండిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ఎటిదార్‌పల్లిలో దళితుడు రవిపై అదేగ్రామానికి చెందిన కృష్ణయ్యగౌడ్ దాడి చేశారన్నారు. శేఖర్, మల్లేష్, కుర్మయ్య, కాశన్న తదితరులు పాల్గొన్నారు.